# చదువుసంధ్యలు

శంకరదీక్షితులు గారు

రామన్నదీక్షితులుగారి కొక్కడే కొడుకు. అందులో లేకలేక నలుబదియారవ యేట బుట్టినకొడుకు! పాప మాయన కది వఱ కెందఱో పుట్టి రెండుమూడేండ్లు జీవించి గతించుటచే ఈకొడుకనిన ననురాగము మెండు. ఆయనకొక్కడికే కాదు; ఆయన భార్యయగు అచ్చమ్మకుగూడ నంతే! సాధారణసంసారుల యింట బుట్టినబిడ్డకు వీలగుగారాబములతో నీదంపతు లీకొడుకు నైదేండ్లుగడచుపర్యంత మును బెంచిరి. అంతవఱకు నాతని కేనామ ధేయమును వా రిచ్చియుండలేదు. ఇక విద్యా భ్యాసమున కాతని బడి కంపవలసివచ్చుటచే, నేదైన నామధేయ మాతని కీయవలసి వచ్చెను.

"ఏమే! అబ్బాయిని రేపు చదువునకు వీరేశలింగముబడిలో ప్రవేశపెట్టవలెనని అను కొనుచున్నాను. వానికి పేరుపెట్టవలె నని యింతవఱకు నాకేమియు నాలోచన లేకపోయి నది. ఇక నేదైన బేరుపెట్టకపోయినచో వానిని బడిలో చేర్చుటెట్లు? ఏమని పేరుపెట్టితే బా గుండునో!"

"సరే! నన్నడుగు టెందులకు? ఇది వఱ కేవిషయములోనైన, నేను చెప్పినమాట వినుట కలదా యేమిటి? ఏమి? పేరులేకపోయి నచో, లోకములో కుఱ్ఱవాడు బ్రతుకలేడా ఏమిటి? ఈమాత్రము దానికి, అంగవస్త్ర మును నడుమునకు మోకాళ్లకు బిగించి, పని గా కూర్చున్నారు!" అని రుసరుసల కచ్చమ్మ నాందీపూజ నారంభించెను. కాని రామన్న దీక్షితులు చాల యోరిమిగలవాడు. లేనిచో, అచ్చమ్మమాటలకు బౌరుషము గలపెనిమిటి యైనచో, దినదినమును నాలుగైదువేషమండ లు విరుగగొట్టుటయో, ఘుడియఘుడియకు నిరుగుపొరుగువారల మాధ్యస్థమో సంభ వించుచునే యుండియుండును. కాని దీక్షితు లును భూదేవియు నోర్పున సమానులు. అందు లకు గారణము మీరడుగనురాదు. మేము దెలుపనురాదు.

"అదికాదే! బడిలో చేరిన తర్వాత ఏ పేరును లేనిచో వానిని పంతు లేమని పిలువ వలెను? ఇన్నాళ్లును, మన కొక్కడే పిల్ల వాడు; కాబట్టి, మనము వాని నెట్లుపిలిచినను బలికెడివాడు. బడిలో వానికి, నాయనా, బాబూ, అబ్బాయీ, చిట్టిగా—అని పేరున్న చో తోడికుఱ్ఱవాండ్రందరును, వేళాకోళ మారంభించెదరు. అందుచేత, గతించి నలు బదియేండ్లయినది. పేరు శాశ్వతముగా వంశ ములో నిలువగలదు. మాతండ్రిగారి పేరు

పెట్టదలచినాను. 'కామావధాన్లు' అని పేరు వ్రాయించినచో, నాకును నాపూర్వులకును గూడ, చాల తృప్తి.

"ఈసిద్ధాంతము బెట్టికొని, మరల నాయొద్ద నీవిచారణ మంతయు నెందులకు? వాడు పుట్టినప్పుడే ఆపాడుపేరు వాడికొసట వ్రాసియున్నదికాబోలును! లేకపోయినచో, నిక్షేపమువలె నున్న కుర్రవానికి కామన్న, రామన్న, వెంకన్న, భీమన్న అని పేర్లెక్కడైన నుండునా? చాలు చాలు! పెండ్లి చేసియొక యింటివానిని జేసిన మామగారియందింతమాత్రము కృతజ్ఞత అక్కరలేదా? మీకామావధాన్లుగా రెట్లుండిరో మీరెరుగుదురా?" అని అచ్చమ్మ ధుమధుమలాడుచు నింటిలోని కేగెను. ఎట్లైననేమి? బాలునకు రామన్నదీక్షితులుగారి తండ్రి మామలపేరులు కలిపి యుంచబడెను. అప్పటికైన నచ్చమ్మకు బూర్తిగ దృప్తికలుగలేదు.

పదునైదేండ్ల ప్రాయమునకు వేంకటరామలక్ష్మీనరసింహ కామోజీరావు స్కూలు ఫైనలుక్లాసులోనికి బ్రాకెను. తలచుగా నీదినములలో స్కూలుఫైనలు క్లాసువఱకును బైకెగబ్రాకుటకు బాలునిబుద్ధికుశలతతో నవసరము లేదు. విద్యజెప్ప నేర్పఱుపబడిన గురువును, బాలుని తల్లిదండ్రులు నాపని వానికొఱకు నిర్వహింపగలరు. కథానాయకుని విషయమున నీప్రక్రియ, సమంజసముగా సార్థకముగా, సంపూర్ణముగా నెరవేరినది. ఇట్లింటి మని విద్యార్థులుకాని, వారి జననీజనకులుగాని, మాపై నాగ్రహము బూనవలదు. మేము లోకసామాన్యమును గుఱించి చెప్పుచుంటిమి. కాని, నిదర్శనప్రచారమువంకబోము. చదువుకొను విద్యార్థులలో నిజముగా బాటుపడి తమ బుద్ధికుశలతయే యాధారముగ, బైతరగతులలోని కేగువారలే లేకున్న నీనాటికి కళాశాలలలో కొన్నిటికి స్వస్తి చెప్పవలసినదే! అందఱు నొక్కటే తెగవారైనచో వాహనము సాగుటెట్లు?

"మన రామన్నదీక్షితులుగారి కుమారుడు" కాబట్టి నాల్గవక్లాసు గడచువఱకును, దినదినమును వైదికతంత్రములయందు దీక్షితసహాయ మపేక్షించిన ప్రారంభపాఠశాలోపాధ్యాయులు వెనుకముందరయకుండ నీ—కామోజీరావును "ప్రమోషను" చేయుచుండిరి. ఏమైననేమి, కుర్రవాడు పెద్దపాఠశాలలో జేరవలసినదినములు వచ్చెను. తండ్రియును, వేరుప్రయత్నములను బ్రారంభింపవలసినయవసరము గలిగెను. స్వల్పజీతగాండ్రైన ప్రారంభపాఠశాలోపాధ్యాయులదారి వేరు; దినమున కథమము "రూపాయ" జీతముగను, 'రూపాయ" నగటున "ప్రైవేటు టీచింగు" వలనను సంపాదించుచు కొంచెము వెగటుదనమును నేర్చిన ఉన్నతపాఠశాలోపాధ్యాయులదారి వేరు. దాని కనుగుణముగనే దీక్షితులుగారు తనపద్ధతులగూడ మార్చెను.

II

ప్రతిదిన ముదయమున స్నానసంధ్యాదులవెల్ల దీర్చికొని దీక్షితులు బజారున కేగుచు "సత్యనారాయణగారింటికి," "రామదాసు

గారింటికి" "నరసింగరావుగారింటికి" బోయి, "పంతులుగారూ బజారుకు పోవుచున్నాను, ఏమైనగావలెనా?" అని ప్రశ్నించి వారికి గావలసినసరకులు వారిచ్చినధనముతో దెచ్చియిచ్చుచుండును. అదిమాత్ర మెంతకాదు! ఇంటియొద్దకు "ప్రైవేటుటీచింగు"కై వచ్చిన బాలురను గూలనైచికొని నాలుగురూప్యము లార్జింప నుత్సహించు నీయుపాధ్యాయుల కింటిలోనికి సామానులు నిలువయుండి చెడిపోకుండ ననుదినమును దెచ్చిపెట్టుట కయోచితముగా నేర్పడిన యీదీక్షితులుగారి కుమారున కుచితముగా విద్య నిచ్చుట కీయుపాధ్యాయుల కేమి లోటు! నలుగురితోపాటు వర్థించుట కష్టము గాదుకదా!

సంవత్సరాంతపు పరీక్షలకు ముందు పిలువని పిలుపుగా నచ్చమ్మ వారి, పేరియిండ్లకు బోయి, యుపాధ్యాయులకు దోడ్పడుటకూడ కలదు. ఇకని—కామేశ్వరరావునకు పరీక్షలలో నిరాఘాటముగా ప్రమోషను లభింపకుండునా?

ప్రమోషను లభించుచునే యున్నది. కాని, కథానాయకుని తెలివితేట లెట్టివో మీకు గొంచె మెఱింగింపవలయును గదా? ఉన్న దున్నట్లుగా వ్రాయ వారమే కాని మాకు ప్రత్యేకదురభిప్రాయ సదభిప్రాయము లుంచుకొనుటకు లేశము నవసరము లేదు.

ఈతడు స్వచ్ఛముగా నుచ్చరించి మాటలాడు స్వభావము నెరుంగడు. మాటలాడు నప్పుడు సగమక్షరములను మాటలను దిగమ్రింగుచుండును. మిగిలియున్నవాని నైనను ధైర్యముగా నెదుటివారికి వినబడునట్లుచ్చరింపనేరడు. తల నొకప్రక్కకు వ్రేలవైచికొని, ఎదుటనున్నవా రలికిపడిపోవుదురేమో యను భయముచే గాబోలు నీతడు గుసగుసలాడినట్లు మాటలాడును. ఈతడీపద్ధతి నేల యవలంబించెనో మే మెఱుంగము. కాని పాఠశాలలోసైత మీతడిట్లే మాటలాడుచుండునని వానిగురువు లొకరిద్దఱు తమలో తామనుకొనుచుండగా మావీనుల బడినది. ఇంటనేమి, వీధినేమి, బడిలోనేమి. ఈతడీవరుసనే కోపమునందును, దైన్యమునందును, సరసమునందును మాటలాడుచుండును. తల్లిదండ్రు లెన్నిసారులు నిందించినను, గురువు లెన్నిసారులు దండించినను, స్నేహితు లెన్నిసారు లెక్కసక్కెము లాడినను, ఆతడు లక్ష్యముజేయలేదు. వాక్స్నానమున నేపాపగ్రహము దాపరించినదో యని చెప్పదలచుకొనువారు విసిగి యూరకుండిరి.

ఈతడాధునికవిద్యాభ్యాసకుడే యైనను, ప్రాచీనపద్ధతినే పాఠపఠనమం దిప్పటికి నవలంబించుచుండును. "Kingsley's Heroes" ను కూడ నీతడు వేదపనసవలె నరుసబెట్టి వల్లననేయుట కలవాటుపడినవాడు. లెక్కలైననేమి, ఆంధ్రగ్రంథమైననేమి, Asia Political Geography యైననేమి, మరే "సబ్జక్టు" నైననేమి ఈతడీవేదపుబుఱ్ఱపద్ధతినే సాగదీసి, మెలతవైచి, మెడకుజుట్టి, గిరగిర చరచర నర్లించును. ఒకనియమములేదు, ఒకజాతిలేదు, ఒకమార్గములేదు. ఆతడీపద్ధతి నెన్నిదినము

లైనను వినుచున్నట్లు లేదు. ఈతడు చదువునప్పుడరమైలువరకు నింకొకడు చదువుకొనదోచకుండసియీపాటకును రెండంగుళముల దూరమున నున్నను వినబడని యీతనిమాటకు నేమిదాంపత్యమో ఎట్లు సమకూరెనో చెప్పలేము. చదువునప్పటిధాటి మాటలాడునప్పుడును మాటలాడునప్పటి పిఱికితనము పాఠపఠనమునందు నుండిన మా కీపాట్లేల? ఈపాటవరుసలో జదువున దేదియో యెదుట నున్నవారికి దెలియదు సరేకదా, ఆతనికి గూడ రవంతైనను గ్రాహ్యము కాదని వేఱు చెప్ప నవసరము లేదు. గ్రాహ్యమైనచో నాతని సంవత్సరాంతపు బరీక్షాసమయమున తల్లిదండ్రుల కీపాట్లేల?

సాధారణముగా నాతడు విశేషబుద్ధికుశలత కలవాడు కాడని మేము వేఱుగా వచింప నవసరము లేదు. రెండుమూడుపర్యాయములు చెప్పినగాని ఆతని కేవిషయమును జ్ఞాపకముండదు. తండ్రిగారుకాని, గురువుగారుకాని, ఏదైన బనిమీద నాతని బంపినచో, నప్పుడప్పు డాతడు తిరిగి యరుదెంచి, అతివినయముగా పంపించినపని యేమని కనుగొని పోవుటకూడ గలదు. అవసరమైనగాని, ఈతడు నలుగు రుండుచోట నుండుస్వభావము గలవాడు కాడు. అటలన్న నీతని కసహ్యము. కారణము వానివలన చదువునకు భంగము గలుగుననిమాత్రము కాదు.

III

పదునేడేండ్లు ప్రాప్తించునరికి మెట్టుమెట్టుగా సీతామోజీరావు స్కూలుపైనలుక్లాసులోని కెగబ్రాకెను. ఈక్లాసులో నంతగా మాతాపితృసహాయమునకు వీలులేకపోయినను, వత్సరము పొడగున నుపాధ్యాయుల సూటిమాటలకును ధాటిదెలుపు చేష్టలకును గురికాగల కుమారునిమార్గమును వారు కొంత నునుపుగా జేసిరి. రానురాను కుమారుడుకూడ క్లాసుయొక్క యుపాధ్యాయులపరిచర్య కందుకొనుటయు నీనునుపునకు గారణము కావచ్చును. ద్వాదశీభోజనములకు, కాఫీహోటలు రాయబారమునకును, Exercise పుస్తకముల యింటిమోతకు నుపచరించు నీమృదుస్వభావునియం దేయుపాధ్యాయునకు గోపముండును? బడిపరీక్షలలో ప్యాసుమార్కుల కేలోటును లేకుండ జరిగెను. ఇంతలో నొకసోమయాజిగారు వరాన్వేషియై యాగ్రామమునకు విచ్చేసి వాకబువలన రామన్నదీక్షితులుగారి పుత్రరత్నమును గుఱించి తెలిసికొని దీక్షితులుగారి కులగోత్రాదులను గుఱించి విచారించి తృప్తిజెంది, బడిలో నుపాధ్యాయులవలన నాయన కుమారుడల్లరిచిల్లరివాడు కాడనియు, నెమ్మదియైన వాడనియు గ్రహించి యొకసుదినమున దీక్షితులుగారి యింటికరుదెంచి, వీథియరుగుపై నుపవిష్టుడాయెను. ఉదయ మెనిమిదిగంటలాయెను. అనుష్ఠానము లన్నియు దీర్చికొని, తడియంగవస్త్రమును జేతధరించి నీర్కావిపంచయు నుత్తరీయముతో నూరిలోనికి బోనుద్యుక్తుడైన దీక్షితులు వీథిగుమ్మము దాటునరి కరుగుపై నున్న కుండలధారిని జూచి అనుమానించి ఏమైననేమి యని తెగువదెచ్చి

కొని, కొంచెము దగ్గుచు నాగంతుకుని దృష్టి నాకర్షించెను.

"రామన్న దీక్షితులుగారియిల్లిదియే నాండి?" అని సోమయాజులుగారు లేచి నిలిచి ప్రశ్నించిరి.

"చిత్తమిదేనండి! నేనే, రామన్నదీక్షితులను. మన దేయూరు?"

"నాది కంచంపాడగ్రహారము. నాపేరు విశ్వనాధసోమయాజులంటారండి!"



'లోనికి దయచేయిండి!' ఏమే కాళ్లు కడుగుకొనుటకు నీళ్లు తీసికొనిరా," అని రామన్నదీక్షితులు భార్యతెచ్చిన పీటపై, తనచేతిలోని అంగవస్త్రము నాయనకిచ్చి, లోనికేగి, తివాసి దులిపి, నేలపై బఱచి, సోమయాజులుగారితో దానిపైగూర్చుండెను. భోజనార్థము వచ్చిన ముఖమేమోఅని, అచ్చమ్మ యొక్కసారి తొంగిచూచి, లోనికేగెను. ఇంతలో దీక్షితులుగారి పొరుగింటి యజమానియైన నరసన్నగారుకూడ, సోమయాజులుగారికి జేసి నవాగ్దాన ప్రకారము లోని కరుదెంచి యుపవిష్టులై, "సోమయాజులుగారు తమ కూతురిని మన కామోజీ కీయవలయు ననునుద్దేశముతో నరుదెంచినారు." అని యుపోద్ఘాతము నను గ్రహించెను.

ఆసాయంకాలమునకు వివాహము నిశ్చయమై పెద్దలసమక్షమున వియ్యంకలిద్దఱును తాంబూలముల నిచ్చికొనిరి. ఇరువురి సాంప్రదాయములును సుప్రసిద్ధములే కావునను ఇర్వురకును ధనాపేక్ష లేశమును లేకుండుట చేతను, కార్యభంగమున కవకాశము లేకపోయెను. కొంచెముగా లాంఛనములవిషయమై పట్టుబట్టిన అచ్చమ్మకూడ, త్వరలో పరిణయ శుభమును రుచిచూడవలెనని కాబోలును గ్రంథమును బెంచలేదు.

ఒక శుభముహూర్త సమయమున కామోజీరావునకును లక్ష్మమ్మకును బరిణయము కంచంపాడగ్రహారమున శుభప్రదముగా, సలక్షణముగా జరిగెను. గృహప్రవేశాదులన్నియు దీరినతర్వాత కామోజీ తిరిగి బడిలోనికి బోవ బ్రారంభించెను. పరిణయపు దొందరల వలననో వధూపదనిక్షేప సంపదనో పాపము దీక్షితులుగారు రోగగ్రస్తులై మంచమెక్కి యౌషధసేవ చేయనారంభించిరి. గ్రామభిషక్చక్రవర్తియగు ప్రతికక్షికుతారం తిరువేంకటాచార్యులుగారు సర్వవిధముల బ్రయత్నించుచుండిరేకాని దీక్షితులుగారి వ్యాధిమాత్రము మరలుమొగము జూపలేదు. క్రమ

ముగా దేహమున నీరుపట్టి రోగి కదలుటకు గూడ నవకాశము లేకుండజేసెను. దేశములోని దేవతలకెల్లరకు నచ్చమ్మ మ్రొక్కులిడుచుండెనే కాని ఆలకించువా రెవ్వరును లేరైరి.

"ఆయన కేమిభయమమ్మా! నిన్నటికన్న ఈదినము కొంచెము సుగుణముగానే కన్పడుచున్నది. మీరు జడియ నవసరము లేదు. నాయొద్దనున్న యౌషధములు సామాన్యమైనవి కావు. అందులో చిన్ననాటినుండియు నొకచోట పెరిగిన దీక్షితులుగారి తత్త్వము నేనెఱుగనిది కాదు. మందు క్రమేణ గుణమిచ్చును. త్వరలో వ్యాధి నణగద్రొక్కుట కూడ మనకు శ్రేయము కాదు" అని వైద్యుడన్నివేళల నచ్చమ్మకు ధైర్యము చెప్పుచుండెడివాడు.

కామోజీరావునకు పరీక్షా దినములు. ఇంట తండ్రిగారికి పరిచర్య చేయుటచేతను, తత్పూర్వము సుమారు నెలదినములు పరిణయపు తొందరలవలనను పాఠమాత్రనికి చదువుటకు దగిన సావకాశము లేకుండుటచేతనే కాక మనస్స్వస్థిమితము లేకపోవుటచే పరీక్షలో తాను తృప్తికరముగ వ్రాయలేదని కామోజీ యుపాధ్యాయులతో చెప్పుకొనవలసి వచ్చెను.

## IV

ఇటుండగా వేసవికాలపు శలవులయందొకనాటిరాత్రి దీక్షితులుగారికి హెచ్చుచేసెను. తిరువెంకటాచార్యులుగారు తొందరపనియున్నదని నాటిసాయంకాలమే రోగిని జూడ వచ్చినప్పుడు శలవిచ్చి, పయనమై పోయిరి. గ్రామములోనున్న యితర వైద్యులసహాయమున తెల్లవారువఱకును జీవములు నిల్చినవి కాని, అటుపిమ్మట సాధ్యము కాకపోయెను. ఉదయ మెనిమిదిగంటల కాయన పరమపదించిరి. సంసారబాధ్యత కామోజీనె త్రిప్పబడెను.

ఎట్టెట్లో పండ్రెండుదినములను గడిపి కామోజీ నూతనవైధవ్య క్లేశముచే కృశించియున్న అచ్చమ్మయొద్దకు జేరి హాహారున నేడ్వసాగెను. తనదుఃఖమును దిగమ్రింగ యత్నించుచు నామె కుమారుని సమాశ్వాసింపదొడగెను.

"నాయనా! ఆయనకేమి అదృష్టవంతుడే. భారమంతయు నీపై బడినది. ఎట్లు భరింతువో! కోడలు కాపురమునకు వచ్చినతర్వాత నాలుగేండ్లపాటు జీవించియుండిన యెడల, నీ కింతకష్ట మనుభవించకపోవునేమో? ఏమిచేయగలము? చదివినంతవఱకు జాలును. నాయనా! ఏదైన ఉద్యోగప్రయత్నము చేయుట మంచిది. ఆయన నిన్ను కేవలము నిరాధారునిగా చేసిపోలేదు. సాలునకు గిరిసెడుధాన్యమువచ్చు పొలమును, ఈకొంపయు, ఆయనస్వార్జితమే. దీనిని ఆధారముగా చేసికొని, ఏదైన చిన్నఉద్యోగములో చేరినయెడల సంసారము గోప్యముగా జరుగవచ్చును. ఆయన పేరెరుగనివా రీపట్నంలో ఎవరునూ లేరు. ఫలానాఅంటే నీ కుద్యోగమునకు కొదువయుండకూడదు. బెంగపెట్టుకోక. ధైర్యము తెచ్చుకో. మొన్న నీ మామగారు తిరిగివారము దినములలో వచ్చెదమని చెప్పిపోయినారు.

ఆయనవచ్చినతోడనే ఆలోచించి, ఏదైన ప్రయత్నము చేయుదువుగానిలే! ఇంట్లో కూర్చుండి, ఊరకే కుళ్లికుళ్లి ఏడ్చిన ప్రయోజన మేమున్నది. ఒకసారి వీధిలోనికి పోయి రా నాయనా?"

సోమయాజులుగారు కూడ పదిదినములలో వచ్చి యల్లునకు ధైర్యము జెప్పి యుద్యోగప్రయత్నములకు తానుకూడ దోడ్పడసాగెను. ఇంతలో పరీక్షాఫలితములుకూడ వచ్చినవి. కామోజీరావునకు పంచాంగమువంటి సర్టిఫికెట్టు చేతికివచ్చినదే కాని లోనిమార్కులపట్టికమాత్ర ముత్సాహాకరముగా లేదు. రెండుముఖ్యమైన సబ్జక్టులలో రావలసినమార్కులకన్న తక్కువవచ్చినవి కాబట్టి "కలెక్టరాఫీసులో" ప్రవేశము దొరకుట దుర్లభమని ఆకచ్చేరీ శిరస్తాదారుడు మొదటనే సెలవిచ్చెను. ఏమైననేమి యని అర్జీ నొకదానిని వ్రాసికొని, సప్తపింజలను సరిగా మడచి, ముఖమున దళముగా విభూతిబూసికొని, కామోజీరా వొక నా డుదయము తనమార్కులపట్టీతో, కలెక్టరుదొరను చూడబోయెను. ద్వారమును గాచువాని మామూలుచెల్లించి దొరను చూచుసమయమునకై యొకగంట నిరీక్షించి, అనుజ్ఞాతుడై లోనికేగి సలాముచేసి, తనచేతిలోని అర్జీయును, బుస్తకము నాయన కొసగెను. దొర దాని నందికొని క్షణమాత్ర మది పరిశీలించి, పుస్తకమునువిప్పిచూచి, కామోజీనెగాదిగ బరీక్షించి, చిరునగవుతో నాంగ్లమున "నీవు" బ్రాహ్మణుడవు కాబోలు" నని విమర్శించి, యాతని కీయదగినపని లేదని చెప్పి పంపివైచెను. మారుమాటాడనేరక, కామోజీ తిరిగి సలాముచేసి దైన్యమును వెదజల్లు మోముతో నిల్లుజేరెను.



ఇట్లుండగా మునసబుకచేరియం దొకటిన్నర నెల కాళీకలదని యాతనికి దెలిసెను. వెంటనే యాత డర్జీ నివ్రాసికొని ఆకచేరిహెడ్డుగుమాస్తాగారిని దర్శించెను. స్వలాభ మావంతయు లేకుండ సహాయము చేయనేరని మానవప్రకృతికల ఈకాలములో, నాతడు తనకొక నెలలో సగముజీత మిచ్చినచో, రెండుమూడుదినములలో పని నిప్పించెదనని వాగ్దానమొనర్చుట వింత కాదు! చిత్తమనిచెప్పి కామోజీ శలవుగైకొని "చచ్చినవాని పెండ్లికి వచ్చినదే కట్న మన్న" ట్లూహించికొనెను. నాలుగుదినములలో కామోజీ పనిలో బ్రవేశించెను. స్వబుద్ధిప్రయోజకత్వములచే కాక, వేఱు కారణములచే బైకివచ్చిన అధికారియొద్దపనిచేయుట బుద్ధిమంతులకు కష్టముకాని కామోజీవంటివారలకు కష్టమనిపించదు. వినయగుణసంపన్నుడగుటచేతను, కొంచెముగా దస్తూరీ బాగుగా నుండుటచేతను, హెడ్డుగుమాస్తా తనపనినిగూడ నీతనిచేతనే కొంతవఱకు చేయించుకొనుచుండెను. ఉదయ మారుగంటలకు విడిచినయింటి కాతడు తిరిగి 10

గంటల కరుదెంచి, 11 గంటలకే ఆఫీసున కేగవలసివచ్చెడిది. తిరిగి రాత్రి 9 గంటలకే యింటికివచ్చుట కవకాశము కలుగుచుండెను. ఒక్కొకప్పు డింటికిగూడ నాఫీసుకాకితములను దెచ్చి రాత్రి యొంటిగంటవఱకు గూడ పనిచేయుచుండుట తటస్థించుచుండెను.

ఈరీతిగా నొకటిన్నర మాసము గడచెను. పనికూడ ముగిసెను. తిరిగి యుద్యోగమునకు ప్రయత్నము చేయవలసివచ్చెను. 15 దినములోకపాఠశాలయం దుపాధ్యాయుడుగా పనిచేసెను కాని, తిరిగి ఖాళీకలిగినప్పు డాతనిపని తృప్తికరముగా లేదని పాఠశాలాధికారి వానికుద్యోగమీయక వేఱొకని నాసనిలో బ్రవేశపెట్టెను. తాలూకా కచ్చేరియం దొకమాసము పనిచేయునప్పటి కాతని కనారోగ్యము కలుగుటచేతను, తిరుగ వచ్చుట ఖాళీలు లేకపోవుటచేతను కామోజీరావునకు దిరుగ పని లభించుటకు గొంతకాలము పట్టెను, ఇంతలో లక్ష్మమ్మ కాపురమునకు వచ్చుటచే నింటిఖర్చుకూడ పెరుగజొచ్చెను. వైదికాచారమున క్లప్తముగా ఖర్చు జేసికొనుచు, వచ్చిన రాబడియందే కుమారునకు విద్యలు చెప్పించి యొక గృహమును, కొంతభూమిని నిలువచేయగలిగిన దీక్షితులుగారి కొమారు డార్జననారంభించిన మూడు సంవత్సరముల నాటికి, నవీనవిద్యాప్రాగల్భ్యముచే మున్నూరురూపాయీ లప్పుచేయవలసివచ్చెను. ఖర్చు తగ్గించు మిషచేతను, తదితరకారణములచేతను, కాయమైనను, తక్కువసర్వీసుకలగుమాస్తాల నన్నికచ్చేరిలయందును దీసివేయుచుండిరి. ఈయొత్తిడి ముఖ్యముగా కామోజీకులస్థులకు తగిలినది. వినుటచే నాతడు చాల నిరుత్సాహపడెను.

"అయ్యో! ఇన్ని దినములనుండియు గులవృత్తిని గర్హించి తదర్థశాస్త్ర పఠనాదులను చేయక, కిరీటము లభించునని నాకరణములేని విద్య నభ్యసించి ప్రయోజనము లేక "రెంటికిని జెడిన రేవడి నైతిని!" ఇప్పుడయ్యావి నేర్చుటకు మనస్సు కొంచెమైనను ఇష్టపడుటలేదు. జీవనోపాధికి మార్గము కనుపించదు. కష్టపడి పూర్వు లార్జించినదానికే నేను విఘాతము కలుగజేయుచున్నాను. తండ్రి తాత లవలంబించిన వృత్తిని బోనాడుకుంటిని. ఇప్పుడు నా ముఖముజూచువా రెవ్వరు? గుమాస్తానికి తప్ప మరేవృత్తికిని బనికిరాని నావలన నావారల కేమిప్రయోజనము కలుగగలదు? ఏవృత్తినైన నేర్చికొని యుండినచో, ధైర్యముగా నీవఱ కొకరిప్రేక్ష్యము లేకుండ కాలానికొనిని సంసారపోషణమనిన నింత బెంగపెట్టికొనక యుందునుకదా? నావలెనే భ్రష్టులైనవా రింకనెంద రున్నారో?" అని పాపమాతడు చాల కళవళపడుచుండుట విని ఆగ్రామవాసియగు నొక వర్తకశిఖామణి, తనహృదయమునందికను నిలిచియున్న బ్రాహ్మణ గౌరవమువలనను, ముఖ్యముగా దీక్షితులుగారియెడ గలసదభిప్రాయముచేత నా కామోజీని బిలువనంపి యధైర్యము నొందవలదని బోధించి, తనయొద్ద నుత్తరప్రత్యుత్తరములను నడపుటకును, లెక్కలను వ్రాయుటకును నెల కొకపదునైదురూప్యముల వేతనముపై నుండవలసినదనియు, కాలక్రమమున దగినప్రోత్సాహమును జూపెదననియు దెలిపెను. కామోజీరావు నేటికి నదేపనియం దున్నాడు. భగవదిచ్ఛ ముం దెట్లుండునో ఎవ్వరు చెప్పగలరు?